# తిరిగిరాని వసంతం




## చంద్రావళీ సుదర్శన్

**పరమేశ్వరం** అన్నంముందు కూర్చున్నాడు. భార్య విమల పక్కనే కూర్చుంది వడ్డించ డానికి.

తినేముందు వో సారి వంటకాలవైపు చూశాడు, పళ్ళెంలో అన్నం, వో పక్క కందిపొడి, మరో పక్క చింతకాయ పచ్చడి, ఎదురుగా రెండు చిన్న గిన్నెల్లో చారు, నీళ్ళ మజ్జిగ.

బయటికి రాబోయిన నిట్టూర్పుని బలవంతాన అపుకున్నాడు.

"తినండి, ఏమి టాలోచిస్తున్నారు?"

భార్య సంబోధింపుతో పరధ్యానం వదలి గబగబా అన్నం కలిపాడు పరమేశ్వరం.

భోజనం చేశాననిపించాక అతను ముందు గదిలో ఉన్న మంచం మీద పడుకున్నాడు. పక్క గదిలో పిల్లలు ముగ్గురూ అల్లరి చేయడం అతనికి వినబడుతూనే ఉంది. అయినా ఆలోచనల్లో మునిగిపోయాడు పరమేశ్వరం.


పరమేశ్వరం ఒక ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తా.

అతనికి ఎన్నాళ్ళుగానో వో కోరిక ఉంది, ఫైవ్ స్టార్ హోటల్లో భోజనం చేయాలని. ఆ కోరిక ఈ జన్మకి తీరదని తెలుసు. కనీసం వో కోడైనా కొనుక్కుని తినాలని ఉంది. అదైనా తీర్చుకోలేక పోతున్నాడు. ఎప్పుడైనా పదిహేను రోజుల కోసారి వో పావుకేజీ మాంసం తెస్తే, దాంట్లో భార్య వో అర్ధకేజీ బంగాళాదుంపలో, లేక వంకాయలో వేసి వండి పిల్లలందరికీ సరిపుచ్చుతుంది. ఆవేళైనా తృప్తిగా తినలేకపోతాడు పరమేశ్వరం. వారానికి ఒకసారి ఒకటి, రెండు కోడిగుడ్లు తెస్తే, వాటిలో భార్య ఉల్లిపాయలు ఎక్కువగా తరిగి నాలుగు ఆమ్లెట్లు వేస్తే, పిల్లలంతా 'నాకు, నాకు' అని ఎగబడుతుంటే చూడలేక వారికే ఇచ్చేస్తాడు పరమేశ్వరం.

అసలు తృప్తిగా తా నెప్పుడు భోజనం చేశాడో గుర్తులేదు పరమేశ్వరానికి. ఏదైనా పండగ వస్తే వంటకాలు దండిగా ఉన్నప్పటికీ పండగ కైన అప్పు అతన్ని తృప్తిగా తిననివ్వకుండా భయపెడుతుంది.

ఇంకా కొంతవరకు పరమేశ్వరం అదృష్టవంతుడు. అతని భార్య విమల పొదుపరి. భార్య చేసే వంటకాలు అతనికి గమ్మత్తుగా ఉంటాయి. ఉదయం తీసుకునే పావుశేరు పాలలోనే అందరికీ కాఫీ తయారవుతుంది. మజ్జిగా మిగులుతుంది. ఆ కాఫీ అతనికి వాసపడి మప్పుడు తమ వంటింటి చూరు నుండి కారే నీళ్ళకు చక్కెర చేర్చినట్లుంటుంది. మజ్జిగేమో సున్నపు తేటలా ఉంటుంది.

ఇక టిఫిన్లేమో అతి తేలికయినవి. మరమరాలు,



అటుకులు తిరగమోత పెట్టి తినమంటుంది. అప్పుడప్పుడు ఉప్మా చేస్తుంది. ఆ ఉప్మాలో నూనె ఎంత వెతికినా కనబడదు పరమేశ్వరానికి. దోసెలు, ఇడ్లీలు, వడలు, పూరీలు లాంటివి చాలా అరుదుగా కనిపిస్తుంటాయి.

అసలు తాను పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టగలుగుతున్నానా అనే అనుమానం వస్తుం



టుంది పరమేశ్వరానికి, అప్పుడప్పుడూ.

పిల్లలకు ఉదయం లేవగానే హార్లిక్సులూ, బోర్న్ విటాలూ తాపాలనీ, పండ్లూ ఫలహారాలూ తేవాలనీ బిస్కట్లూ చాక్లెట్లూ తినిపించాలనీ, కాన్వెంట్‌లో చదివించాలనీ, మంచి మంచి బట్టలు కుట్టించాలనీ ఇలా ఎన్నెన్నో కలలు కనేవాడు.

కానీ అవేవీ నెరవేర లేదు. ఎలాగోలా నెరవేర్చుకోవాలని పరమేశ్వరానికి ఆశ ఉంది.

కానీ ఎలా నెరవేరగలవు తన కోరికలు?

అసలు తన విషయంలో ఏ కలా నిజం చేసుకోలేక పోయాడే! ఇక పిల్లల కేం చేయగలడు?

అతి సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగాడు. ఎమ్. ఎ. చదవా లనుకున్నాడు. ఆఫీసర్ కావాలనీ, స్కూటర్ మీద తిరగాలనీ ఎన్నో ఆశలు. చదువు బి. ఎ. తోనే ఆగిపోయింది. ఆఫీసర్ కావలసినవాడు గుమాస్తా అయ్యాడు. స్కూటర్ బదులు సైకిలొచ్చింది. అదీ అత్తగారి పుణ్యమాలని. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనే కోరిక తీరకపోయినా, అనుకూలవతి అయిన భార్యే వచ్చింది.

తానసుభవిస్తున్న అతి సామాన్య జీవితమే తన పిల్లలకూ సంక్రమించబోతుందా అనేబాధ పరమేశ్వరాన్ని అప్పుడప్పుడూ భూతంలా భయపెడుతుంది.

అందుకే పరమేశ్వరం తనచుట్టూ ఒంటరితనమనే పరిధి గీసుకుని అందులో ముగిలిపోయాడు.

"ఇందాకటినుంచీ చూస్తున్నాను, ఏమిటా పరధ్యానం?"

విమల మాటలతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు పరమేశ్వరం. పక్క గదిలో నిశ్శబ్దంగా ఉంది. పిల్లలు నిద్రపోయారు కాబోలు!

"ఒకటే పొర్లుతున్నారు, నిద్ర రావటంలేదా? ఒంట్లో బాగుందా?" మృదువుగా అడుగుతూ నుదుట చేయి వేసి చూసింది విమల.

"ఏమీలేదు. బాగానే ఉంది." పక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు.

"అయినా మీ కీ మధ్య ఆలోచన లెక్కువై పోయాయి బాబూ!" చాపమీద పడుకుంటూ అంది విమల.

బదులు చెప్పలేదు పరమేశ్వరం. కళ్ళుకూడా తెరవలేదు. ఎందుకో రాజ్యం గుర్తొచ్చిం దతనికి.

• • • •

పొద్దున్నే భార్య పెట్టిన అన్నం తిని, ఆదరా బాదరా ఆఫీసుకు పరిగెత్తే పరమేశ్వరం, అసలు ఇతరుల గురించి ఆలోచించడు. ఆఫీసులో కొలీగ్స్‌తో మాటలుకూడా తక్కువే. ఎక్కువగా మాట్లాడని అతని జోలికి ఎవరూ పోరు. జేబులో డబ్బులు చూసుకుని లంచ్ అవర్లో కాఫీ, టీ తాగడమో, టిఫిన్ తినటమో చేస్తుంటాడు.

ఆ వేళ లంచ్ అవర్లో మామూలుగా జేబులు చూసుకున్నాడు. ఇరవై పైస లున్నాయి. ఒకసారి నిట్టూర్చి తిరిగి ఫైల్లో మునిగిపోయాడు.

అయిదు నిమిషాల తరవాత—

"కాఫీ తీసుకోండి, పరమేశ్వరంగారూ!"

ఉలిక్కి పడి తలెత్తి చూశాక ఆశ్చర్యపోయాడు. ఎదురుగా రాజ్యం!

రాజ్యం వాళ్ళ ఆఫీసులో ఒక్కగా నొక్క లేడీ

టైపిస్టు. ఆర్నెల్ల క్రితం చేరింది. ఆడది అనే భావన తప్ప ఆమెలో పెద్ద ఆకర్షణేమీ లేదు. చాలా సాధారణంగా ఉంటుంది. ఆమె వచ్చిన కొత్తలో తన కొలీగ్స్ అంతా ఆమె చుట్టూ పడి తిరగటం ఇంకా జ్ఞాపకం ఉంది పరమేశ్వరానికి.

కారణం ఇదమిత్థంగా తెలియదు కానీ, మొత్తానికి ఆమెతో మాట్లాడటం తగ్గించారంతా.

''అందరికీ తిక్క కుదిర్చింది రాజ్యం. ఆడది కదా అని కాఫీకి పిలిస్తే చక్కగా బుద్ధి చెప్పింది. మంచి తెలివి గల పిల్ల!''

రాజ్యం గురించి హెడ్‌క్లార్క్ రంగనాథం ఎప్పుడో అన్న మాటలు గుర్తొచ్చాయి పరమేశ్వరానికి.

''ఈ నెలలో రాజ్యం హోటల్ బిల్లూ, సినిమాల బాపతూ డెబ్బై రూపాయలు వదిలాయిరా, బాబూ!''

కొలీగ్స్ సుబ్బారావు, పతి మాట్లాడుకున్నది కూడా జ్ఞాపకం ఉంది.

రాజ్యంతో పరిచయం తక్కువ పరమేశ్వరం ఒక్కడికే.

''ఏమిటలా చూస్తున్నారు? నేనండీ, బాబూ, రాజ్యాన్ని! కాఫీ తీసుకోండి.'' నవ్వుతూ అంది రాజ్యం.

అప్పుడు ఈ లోకంలోకి వచ్చాడు పరమేశ్వరం. ఎదురుగా రాజ్యం కాఫీ కప్పుతో నిలబడి ఉంది.

''ఎందుకండీ? వద్దు, ప్లీజ్!'' మొహమాట పడ్డాడు పరమేశ్వరం.

''ఫరవాలేదు.''

తనే చనువుగా టేబిల్ మీద కాఫీ పెట్టింది.

''ఈ వేళ మీరు కాంటీన్‌కు వెళ్ళలేదేం?'' అడిగింది రాజ్యం.

గబగబా కాఫీ తాగేశాడు పరమేశ్వరం బదులు చెప్పకుండా. మళ్ళీ అదే ప్రశ్న వేసింది రాజ్యం.

''డబ్బులు లేక...'' అప్రయత్నంగా అనేశాడు పరమేశ్వరం.

అతనంత సూటిగా చెబుతాడనుకోలేదు రాజ్యం. అందుకే తెల్లబోయింది.

''సారీ! నేనలా వూహించ లేదు...'' నొచ్చుకుంటూ అంది.

''ఫరవాలేదు లెండి. నెలాఖరు కదూ. నా జేబులో డబ్బు లుండవు.'' నవ్వాడు పరమేశ్వరం.

ఆ నవ్వులో విషాదం గమనించి, జాలి పడింది రాజ్యం.

అప్పటి వరకూ రాజ్యం నిలబడే ఉండటాన్ని గమనించాడు పరమేశ్వరం.

''నిలబడే ఉన్నారు — కుర్చీ తెచ్చేదా?'' లేవబోయాడు.

''వద్దు—నే వెళతాను.''

అప్పటికే ఆఫీసులో ప్రవేశిస్తున్న ఒక రిద్దరు వీరిద్దరి వైపు ఆశ్చర్యంగా చూసేసరికి కప్పు తీసుకుని వెళ్ళిపోయింది రాజ్యం.

● ● ● ●

సాయంత్రం ఆఫీసు నుండి బయట పడ్డాక సుబ్బారావూ, పతీ పరమేశ్వరాన్ని పట్టుకున్నారు.

''ఏమిటి, గురూ? పిట్ట నిన్ను పట్టింది— జాగ్రత్త. అసలే పిల్లలు గలవాడివి!''

''ఛ! ఛ! అనవసరంగా అసహ్యంగా మాట్లాడకండి!'' విసుక్కున్నాడు పరమేశ్వరం.

''ఈ మధ్య ఒక కొత్త విషయం తెలిసింది, గురూ! రాజ్యానికి చిన్నప్పుడే పెళ్ళయిందట! మొగుడొదిలేసి చాలా కాలమయిందిట.'' చెప్పాడు పతి.

''అయితే పెద్ద చెయ్యే నన్న మాట!'' సుబ్బారావు అన్నాడు.

వాళ్ళని తప్పించుకుని రోడ్డు మలుపు నుండి సందులోకి తిరిగాక సైకి లెక్కాడు పరమేశ్వరం.

'రాజ్యానికి పెళ్ళయిందా? పాపం, భర్త వదిలేశాడు కాబోలు! ఇది నిజమై ఉంటుందా, లేక వదంతా? అదే నిజమైతే ఇక బతుకంతా ఒంటరిగా గడపాలి. ప్చ్! ఏమిటో ఈ జీవితాలు!'

మనసులో రాజ్యంపై సానుభూతి కురిపించాడు పరమేశ్వరం.

''ఏమండోయ్, పరమేశ్వరంగారూ!''

ఉలిక్కి పడి సైకిలుకు బ్రేకు వేసి, వెనక్కి తిరిగి చూశాడు ఆశ్చర్యపోతూ. రాజ్యం కొంచెం దూరంలో గబగబా వస్తూ కనిపించింది. ఆమె అతన్ని కలుసుకోగానే సైకిల్ దిగాడు ఆశ్చర్యపోతూ.

''మా ఇల్లు కూడా మీరు వెళ్ళే దారిలోనే.




బహుశా మీగా రది గమనించి ఉండరు లెండి!'' నవ్వింది రాజ్యం.

పరమేశ్వరం మనసులో తెల్ల బోతూనే, ఆమెతో నడవసాగాడు. ఫర్లాంగు దూరంకూడా లేదు రాజ్యం ఇల్లు. ఇంటిలోకి రమ్మని ఆహ్వానించిన రాజ్యాన్ని మృదువుగా తిరస్కరించి, ఇంటి దారి పట్టాడు పరమేశ్వరం.

• • •

నెల రోజులు గడిచాయి. ఈ నెలలో డజను సార్లు రాజ్యంతో పాటుగా ఆఫీసు విడిచాక కలిసి నడిచాడు పరమేశ్వరం. అతనికి రాజ్యం మనస్తత్త్వం ఏమిటో అర్థం కాలేదు. ఈ పరిచయం ఏ పరిణామాలకు దారి తీస్తుందోనని భయపడసాగాడు.

ఆ వేళ సాయంత్రం రాజ్యం ఇల్లు రాగానే యథాప్రకారం తప్పుకో బోయాడు పరమేశ్వరం.

''ఎన్నిసార్లు పిలిచినా ఇంట్లోకి రానే రారు. నాతో స్నేహం మీ కిష్టం లేదా పరమేశ్వరంగారూ? నాకీ వూళ్లో తెలిసిన వారెవరూ లేరు. మీరొకసారి మా ఇంటికి వస్తే, నేనూ మీ ఇంటికి వచ్చి అక్కయ్యగారితో పరిచయం చేసుకుందా మనుకుంటున్నాను. మీరు చూస్తే నన్ను చూడగానే జారుకుంటారు. నేనేమన్నా తప్పుగా ప్రవర్తిస్తున్నానా? కొంచెం నిష్ఠూరంగా అంది రాజ్యం.

పరమేశ్వరం గుండె తేలిక పడింది. రాజ్యం తనతో చేసే స్నేహంలోని అంతరార్థం ఇదన్న మాట! తనే అనవసరంగా అపోహ పడ్డాడు.

''అబ్బే! అదేమీ లేదు. పదండి! ఈ వేళ మీ ఇంటికి వస్తాను'' గేటు తీసి సైకిలును లోపలికి నడిపించాడు.

రాజ్యం ఇంటి తాళం తీస్తుండగా ఇంటావిడ కాబోలు అడిగింది.

''ఎవరమ్మాయీ ఇతను?''

''తెలిసిన వారు లెండి!'' అని.

ఇద్దరూ లోపలికి నడిచారు. చాలా చిన్న ఇల్లు రాజ్యానిది. ముందు గదిలో ఒక చిన్న టేబిల్, ఒక స్టీలు కుర్చీ—టేబిల్ కింద రెండుపెట్టె లున్నాయి. పక్కగా ఒక కుట్టుమిషన్ ఉంది. వెనకదే వంటగది.

స్టీలు కుర్చీలో కూర్చున్నాడు పరమేశ్వరం.

''మీకు కుట్టు వచ్చునా, రాజ్యంగారూ!''

విమల ఎప్పుడూ మిషన్ నేర్చుకుంటానని పోరడం గుర్తొచ్చి అడిగాడు పరమేశ్వరం.

''వచ్చునండీ! నా కీ ఉద్యోగం రాక ముందు ఆధారం అదే!''

''దీనికి అద్దె ఎంతో?''

''డెబ్భై'' అంది రాజ్యం.

''మా ఇల్లు మరొక్క గది పెద్దది. అద్దె నూట పది!''

ఇంకేం మాట్లాడాలో పరమేశ్వరానికి తోచలేదు. ఎప్పుడూ గలగలా మాట్లాడే రాజ్యం మౌనం దాల్చింది.

హఠాత్తుగా అడిగింది రాజ్యం:

''మీరు రేమీ అనుకోకపోతే ఒక్క మాట, పరమేశ్వరంగారూ! సమస్య లనేవి అందరికీ ఉంటాయి.

మీ రెందుకు ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న ట్లుంటారు?

తల వంచుకున్నాడు పరమేశ్వరం.

''నేను పిరికివాణ్ణి రాజ్యంగారూ! నాకు జీవితం అంటే భయం!'' అని చెప్పాలనిపించినా చెప్పలేక పోయాడు.

''నేను మీకు చెప్పగలిగే దాన్ని కాదు పరమేశ్వరం గారూ! ఏటి కెదురీదటం అంటారే, అట్లాంటిదే ఈ జీవితం కూడా. జీవితాన్ని స్పోర్టివ్‌గా గడపటం నేర్చుకోవాలిగానీ, అదో శాపంలా భావించటం తప్పు. మీకు మీరుగా కుంగిపోయే కంటే, సరదాగా గడపటానికి ప్రయత్నించండి. అందులో ఎంత ఆనందం ఉందో తెలుస్తుంది.''

రాజ్యం మాటలతో సేదదీరినట్లయింది పరమేశ్వరానికి.

ఆమె ఆ మాటా ఈ మాటా చెబుతూనే ఉప్మా, కాఫీ చేసి తెచ్చిపెట్టింది. మొహమాట పడుతూనే తిన్నాడు పరమేశ్వరం.

రాజ్యం ప్రతి రోజూ ఆఫీసుకు ఫ్లాస్క్‌లో కాఫీ, బాక్స్‌లో టిఫిన్ తెచ్చుకుంటుంది. ఎవరైనా కంటీను‌కు పిలిస్తే, అవి అట్టే పెట్టుకుంటుంది. 'పట్టి పీనాసిది' అనే బిరుదు కూడా ఉంది ఆఫీసులో.

చీకటి పడుతూండగా ఇల్లు చేరుకున్నాడు పరమేశ్వరం.

''ఏమిటండీ ఇంత ఆలస్యం అయిందేం?'' విమల ఆదుర్దాగా ఎదురొచ్చింది.

చిన్నగా కూనిరాగం తీస్తున్న పరమేశ్వరం వెంటనే జవాబు చెప్పలేదు. కాళ్ళూ, మొహం కడుక్కున్నాక టిఫిన్ తెచ్చింది విమల.

''వద్దు విమలా! నేను టిఫిన్ చేశాను.'' వాలు కుర్చీలో కూర్చుని పేపర్ చేతిలోకి తీసుకుంటూ అన్నాడు పరమేశ్వరం.

''ఎక్కడ చేశారు?'' వింతగా అడిగింది విమల.

''ఒక ఫ్రెండింట్లో!'' అనేశాడు కొంచెంఆగి.

రాజ్యం గురించి చెప్పాలనిపించినా చెప్పలేదు. తను ఇప్పుడు చెబితే విమల అపోహ పడవచ్చు. రాజ్యం తనంతట తానుగా పరిచయం చేసుకొనేవరకూ తను తొందరపడటం మంచిది కాదనిపించింది.

భర్త కోసం ఉంచిన టిఫిన్ పిల్లలకి పెట్టేసింది విమల. మొదటిసారిగా మొగుడి ధోరణి కొంచెం ఆశ్చర్యం అనిపించింది ఆమెకు.

• • • •

ఒక ఆదివారం మధ్యాహ్నం పదకొండు గంటల సమయంలో పరమేశ్వరం రోడ్డు సర్వే చేస్తుండగా రాజ్యం ఎదురైంది.

''ఆదివారం ఖాళీయేగా, మా ఇంటికి రండి!'' అంటూ ఆహ్వానించింది. ఆమె మాట కాదనలేక వెళ్ళాడు పరమేశ్వరం.

లోపలికి వెళ్ళాక కాసేపటికి అడిగింది రాజ్యం.

''మీరు నాన్ వెజ్ తీసుకుం టారు కదూ!'' అని

''ఏం అలా అడుగుతున్నారు?'' ఆశ్చర్యంగా అన్నాడు.

''ఈ వేళ మా ఇంట్లో నాన్—వెజ్ చేశాను.




**- అమరేంద్ర**

నాడు నా జన్మభూమి కర్మభూమి ధర్మభూమి
ధన్యభూమి పుణ్యభూమి శుభదాయిని వరగాయిని
భువన మనోమోహిని ఉభయ సంధ్యలందు విరియు
భవ్యకాంతి దివ్యశాంతి సస్యామల చేలాంచల సంశోభిత
చారుశీల శీతాచల శిరోజ్జ్వల స్మేరానన స్ఫూర్తి శీల
తిమిరపు తెరలను దాగిన అమలిన జ్యోతిని చేరగ
కలల దారి తరలిపోవు అలసి లేని తెరువరి అశాంత
జీవిత మహాబ్ధి గుండెల ప్రశాంత మౌక్తిక శోభ
పెలార్చగ వేదనమే శోధనగా అవిరళమగు సాధనగా
పావన భావారాధనగా అక్షర రూపము దాల్చిన
అక్షయ సౌభాగ్యముగా ముఖరించిన, మోహన రాగిణి
మురిపించిన మంగళ రూపిణి మంటి నుంచి మింటి
కెగయు మృత్యుంజయ పతాక నృత్య గానకళా
విభవ విల్వోల్లసిత ప్రతీక.
నేడు నా భారతి ఆర్తికి భీకరమూర్తి
జీవన రథ శిలాచక్ర శిథిల హృదయ ప్రమాణాలు
రెక్క విరిగి ఎగరలేని దిక్కులేని విహంగాలు
తీరానికి దూరమంది సురిగెన ఘన తరంగాలు
పడి కడలిని సుడి తిరిగే స్వప్ననావం. జీర్ణ శకలాలు
ఎడారి ఇసుకల సెగలను సోకిన
ఒంటరి ఒంటెల బడుగుల బారులు
భగ్న సుధాభాండము కడ
నగ్న నృత్య మొనరించే ఉద్విగ్నుల ఉన్మాదం
వినాశాల వినాదం విధ్వంస ప్రమోదం
శాంత స్వర్ణమందిరాల సమర దుందుభుల
భీషణరావం
అంబర చుంబిత శిఖరాగ్ర సీమల
ప్రదీప్త జ్వాలా ప్రవాళమాలా ప్రకంప నాట్యం
బాణపు దెబ్బకు విలవిల మంటూ దీనంగా
పలపించే భీతహారిణి భవతారిణి
పసివాడి పోతున్నవి ద్వార తోరణాలు
కొడిబారి పోతున్నవి గూటిలో దీపాలు
వూగులాడి పోతున్నవి మంగళ మందిర మణిమయ
స్తంభాలు
అమ్మా! ఎక్కడమ్మా నీ రమ్య హర్మ్యం?
ఎక్కడ నా ప్రియ జనని భారతి
అందుకోదా జ్వలించే హృదయాల కర్పూరహారతి?
ఆలకించదా ఆశా విరాళల రాగమాలిక
తిలకించదా రంగుల కలల పూలపాలిక?



ఫొటో - బి. ప్రభాకర్

భోజనం చేసి వెళ్ళండి'' అంది రాజ్యం.

''వద్దండీ, వద్దు.'' కంగారుగా అన్నాడు పరమేశ్వరం.

''మరేం ఫరవాలేదు'' అంటూనే లోపలికి నడిచింది రాజ్యం.

రెండు నిమిషాలు గడిచీ గడవక ముందే పళ్ళెం చేత్తో పట్టుకొచ్చి టేబిల్ మీద పెట్టింది రాజ్యం.

''ఉండండి— మంచినీళ్ళు తెస్తాను.'' వెంటనే లోపలికి వెళ్ళింది

టేబిల్‌కి దగ్గరగానే ఉంది పరమేశ్వరం కూర్చున్న కుర్చీ. అప్రయత్నంగానే పళ్ళెం వైపు చూశాడు పరమేశ్వరం.

ఒక పక్కగా పొగలు కక్కుతున్న చిన్న మాంసం పులుసు గిన్నె—మరో పక్క వేడి వేడి పలావు—ఒక మూలగా రెండు ఆమ్లెట్లు.

''ఏమి టాలోచిస్తున్నారు? తినండి.'' రాజ్యం నీళ్ళ చెంబుతో వచ్చింది.

చటుక్కున లేచాడు పరమేశ్వరం.

''వద్దు, రాజ్యంగారూ! మా ఇంట్లో నా భార్యా, పిల్లలూ నా కోసం ఎదురు చూస్తుంటారు.''

చకచకా బయటికి నడుస్తున్న పరమేశ్వరం వైపు తెల్లబోయి చూసింది రాజ్యం.

ఆ వేళ విమల పెట్టిన వంకాయ కూరా, చారూ అన్నం అమృతంలా తోచాయి పరమేశ్వరానికి.

మరునాడు ఆఫీసులో పరమేశ్వరాన్ని క్షమించమని కోరింది రాజ్యం.

''మీ భార్యాపిల్లల్ని మరిచిపోయి మిమ్మల్నొక్కర్నే భోజనానికి ఆహ్వానించినందుకు నన్ను మన్నించాలి, పరమేశ్వరంగారూ!'' అన్నది.

''అంత మాటెందుకు లెండి! ఆ మాట కొస్తే మీరే నన్ను క్షమించాలి! పెట్టిన అన్నం ముందు నుంచి లేచి వచ్చినందుకు.'' నొచ్చుకుంటూ అన్నాడు పరమేశ్వరం.

''సరేలెండి! ఈ సారి నేను మీ ఇంటికి వచ్చి అక్కయ్యగారితో పరిచయం చేసుకుంటాను. మీకేం అభ్యంతరం లేదుగదా!''

''ఛ! ఛ! అభ్యంతరం ఎందుకు? తప్పకుండా రండి.''

''కానీ మీ ఆవిడ...'' రాజ్యం సందేహంగా చూసింది.

''ఆ పాటి అర్థం చేసుకోగల సంస్కారం గలదే లెండి మా ఆవిడ!'' పరమేశ్వరం మాటల్లో కించిత్తు గర్వం తొంగి చూసింది.

''థాంక్యూ! అయితే ఈ వేళ సాయంత్రం వస్తాను.'' రాజ్యం చాలా సంతోషంగా వెళ్ళిపోయింది.

అనుకున్నట్లుగానే ఆ వేళ సాయంత్రం రాజ్యం పరమేశ్వరం ఇంటికి వెళ్ళింది. భర్త రాజ్యాన్ని పరిచయం చేయగానే విమల కొంచెం ఆశ్చర్యపడినా, తరవాత రాజ్యం కలుపుగోలుతనానికి ముచ్చట పడి తనూ సరదాగా మాట్లాడింది.

''పిల్లలేరి?'' రాజ్యం కుతూహలంగా అడిగింది.

బయట ఆడుకుంటున్న ముగ్గురినీ పిలిచి చూపించింది విమల.

''వీడు రవి—నాలుగు చదువుతున్నాడు. తరవాతది శారద— రెండు. ఆ తరవాత రత్న— ఒకటి.''

బుట్టలో నుండి తను తెచ్చిన పండ్లూ, బిస్కెట్ల పొట్లాలూ తీసి వారి కివ్వబోయింది రాజ్యం. తీసుకోవాలా, వద్దా అని పిల్లలు అమ్మ వైపూ, నాన్న వైపూ చూశారు. వారి క్రమశిక్షణకు మనసులోనే మెచ్చుకుంది.

''ఫరవాలేదు, తీసుకోండి'' అని విమల అన్నాక తీసుకున్నారు. మరో పావుగంట వారితో గడిపి వెళ్ళిపోయింది రాజ్యం.

మరో రోజు సాయంత్రం విమల దగ్గరకు వెళ్ళింది రాజ్యం. మరు రోజు ఆదివారం. పరమేశ్వరం కుటుంబాన్నంతా భోజనానికి పిలవాలనే ఉద్దేశంతో వెళ్ళింది. తొలి పరిచయం లోనే పిలుద్దామనుకున్నా, విమల ఈ అతి చనువును అపార్థం చేసుకుంటుందేమోనని భయపడింది.

రాజ్యం వెళ్ళేసరికి పరమేశ్వరం ఇంట్లో లేడు. విమల వంట చేసుకుంటోంది. ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ విమలకు వంటలో సాయం చేసింది.

మరో పావు గంటకు వచ్చాడు పరమేశ్వరం. వంటింట్లో కూర్చున్న రాజ్యాన్ని చూసి తెల్లబోయాడు.

''ఎప్పుడొచ్చారు మీరు?'' అడిగాడు.

''ఇప్పుడే. ఓ అరగంట అవుతోంది.'' నవ్వుతూ చెప్పింది రాజ్యం.

''ఏమండోయ్! రాజ్యం రేపు మనల్ని భోజనానికి పిలవడానికి వచ్చిందిట. తననే ఈ పూట మనింట్లో భోజనం చేసి వెళ్ళమంటున్నాను నేను. మీరూ ఓ మాట చెప్పండి!'' అంది గట్టిగా విమల.

''నా బదులూ నువ్వే చెప్పు. అయినా ఆడవాళ్ళిద్దరూ ఒకటై పోయారు. ఇక నే నేం కొంబడతాను'' అన్నాడు పరమేశ్వరం.

విమల, రాజ్యం నవ్వేశారు.

ఏడున్నర కంతా భోజనాలు చేశారు. ఎంతో సరదాగా అనిపించింది పరమేశ్వరానికి ఆ వేళ.

ఉత్సాహంగా మంచం మీద పడుకున్న అతనికి అనుకోకుండా నిద్ర పట్టేసింది.

ఎవరో తట్టి లేపుతూంటే మెలకువ వచ్చింది పరమేశ్వరానికి. ఎదురుగా కొడుకు రవి!

''ఏమిట్రా?'' అన్నాడు విసుగ్గా.

''అమ్మ లేపమంది'' అన్నాడు వాడు.

''ఇంకా పడుకోలేదేం మీరు? అమ్మనే రమ్మను పో!'' అన్నాడు చిరాగ్గా.

వాడు తుర్రుమని లోపలికి వెళ్ళాడు. నిముషం కూడా గడవక ముందే వచ్చింది విమల.

''లేవండి! రాజ్యాన్ని ఇంటి దగ్గర దింపివద్దురు గానీ'' అంది నవ్వుతూనే. తెల్లబోయాడు పరమేశ్వరం.

''ఇంకా వెళ్ళలేదూ రాజ్యం?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''లేదు. ఒక్కర్తే వెళ్ళి ఏం చేస్తుంది? అందుకని నేనే ఉండమన్నాను. కాసేపయాక చూస్తే మీరు నిద్రపోయారు. లేపుదామంటే రాజ్యం ఒప్పుకోలేదు. రాజ్యాన్ని ఒంటరిగా రాత్రిపూట పంపటం నా కిష్టం లేదు. అందుకని ఇంతసేపూ మీరు లేస్తారని చూస్తున్నాము.'' చెప్పింది విమల.

''ఎంతైంది టైమ్?''

''పది కావస్తోంది.''

''అమ్మ బాబోయ్!'' గబుక్కున లేచాడు పరమేశ్వరం.

''క్షమించాలి. మిమ్మల్ని ఇబ్బందిలో పడేశాను'' అంది రాజ్యం పరమేశ్వరాన్ని చూడగానే.

''బాగుంది. ఇందులో ఇబ్బందేముంది?'' పరమేశ్వరం బదులు విమలే అందుకుంది.

రాజ్యం ఇల్లు వచ్చేవరకూ పరమేశ్వరం, రాజ్యం ఏమీ మాట్లాడుకోలేదు.

ఇంటిగేటు తీస్తుండగా మెల్లగా అన్నది రాజ్యం:

''విమల లాంటి భార్యను పొందిన మీరు నిజంగా చాలా అదృష్టవంతులు పరమేశ్వరంగారూ!''

'అవును. అదొక్కటే ఈ జీవితంలో నాకు దేవుడిచ్చిన వరం!' మనసులో అనుకున్నాడు పరమేశ్వరం.

(సశేషం)